

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# నెల రోజులు పోలీస్ యాక్ట్ అమలు

## -సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, జనవరి 31, ప్రభాతవార్త:**

జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ఫిబ్రవరి 1 నుంచి 28వ తారీఖు వరకు జిల్లాలోని ఆయా గ్రామాల్లో 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ సిహెచ్ రూపేష్ చెన్నూరి పేర్కొన్నారు. జిల్లాలో పోలీసుల అనుమతులు లేకుండా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం వాటిల్లే విధంగా వ్యవహరిస్తే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసులకు తమ వంతు సహకరించాలని ఎస్పీ రూపేష్ చెన్నూరి వివరించారు.

## 'రైతు భరోసా' దరఖాస్తుకు నేడు చివరి తేదీ



దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏఈవో సమజాత

**చేర్యాల, జనవరి 31, ప్రభాతవార్త :** మండలంలోని కడవేరుగు, పోతిరెడ్డి పల్లి గ్రామాల రైతులు రైతు భరోసా దరఖాస్తు చేసుకోని వారు నమోదు చేసుకోవాలని నేటితో గడువు ముగుసు_ందని వ్యవసాయ విస్తరణ అధికారి సమజాత ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 01,2025 నాటి వరకు పట్టా దారు పాస్‌బుక్కు కలిగిఉన్న రైతులు అర్హులను సూచించారు. గతంలో రైతు బంధు పడిన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి, కత్తుల నరసింహారెడ్డి, వెంకటేశం, తాడం భూపతి, ముల్క ప్రవీణ్, మేరుగోజు కృష్ణమూర్తి ఉన్నారు.



కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

## కేరళ గవర్నర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్ క్రాంతి

**కంది, జనవరి 31, ప్రభాతవార్త:** కందిలోని ఐఐటిని సందర్శించేందుకు వచ్చిన కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సాదరంగా స్వాగతం పలికారు. ఐఐటీ క్యాంపస్‌కు చేరుకున్న గవర్నర్‌ను అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు సాదరంగా స్వాగతం పలికారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ఐఐటీతో భాగస్వామ్యం అవకాశాల గురించి కలెక్టర్ గవర్నర్‌కు వివరించారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, ఐఐటి నుంచి ప్రభుత్వరంగ అభివృద్ధికి తోడ్పాటు వంటి విషయాలపై కళాశాల డైరెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భవిష్యత్ భారతదేశం నిర్మాణంలో ఐఐటీ విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని అభిలషించారు. ఆధునిక సాంకే తికత వినియోగంతో ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులకు సూచిం చారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు స్టార్టప్‌లు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సహాయం అందచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్ మూర్తి, అదనపు ఎస్పీ సంజీవరావు, ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, డిఎస్‌పి సత్తయ్య, కంది తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన తూంకుంట నర్సారెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తూంకుంట నర్సా రెడ్డి

**గజ్వేల్ టౌన్, జనవరి 31 (ప్రభాతవార్త):** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సా రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు


**జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల బిఆర్‌ఎస్ నాయకులఉ ఎర్రవల్లిలో కలుసుకున్నారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను, హామీలను అమలు చేయని విషయాన్ని ప్రతి గ్రామంలో ప్రజలకు తెలిసేలా చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఘన విజయం సాధించేలా చూడాలని నాయకులకు మాజీ సిఎం సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం, మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాల బిఆర్‌ఎస్ అధ్యక్షులు తట్టునారాయణ, వెంకటేశం, సంజీవరెడ్డి, మున్నూర్ రవీందర్, నాయకులు నరసింహులుయాదవ్, నామ రవికిరణ్, మహిళా అధ్యక్షురాలు మంజుల, అనుషమ్మ పాల్గొని కెసిఆర్‌ను ఘనంగా సన్మానించారు.

## నవ వధువుకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**మర్కుక్, జనవరి 31 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన నీల కవిత, ఐలయ్య కూతురు రాధిక వివాహానికి బిఆర్‌ఎస్ మండల బిసిసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ పుస్తెలు, మెట్టెలను అందజేశారు. ఆయన వెంట మర్కుక్ తాజా మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, కొట్టాల మహేష్, రామచంద్రం ఉన్నారు.

## చెరువు అభివృద్ధి పనులను సమీక్షించిన కలెక్టర్


**రామచంద్రాపురం, జనవరి 31, ప్రభాతవార్త:** తెల్లాపూర్ ప్రాంతంలోని మూడు ప్రధాన చెరువుల అభివృద్ధి, పరిరక్షణ, నీటి నిల్ల సామర్థ్యాన్ని మెరుగుపరిచే అంశాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులతో సమీక్షించారు. చెరువుల ప్రస్తుత స్థితిగతులపై అధ్యాయనం చేసి వాటి పరిరక్షణకు తీసుకోవాల్సి న చర్యలపై అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, మాధురిలతో కలిసి సమీక్షించారు. నీటి పారుదల శాఖ, రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువల వద్ద అక్రమ నిర్మాణాలు, కబ్జాలు కాకుండా చూడాలని ఆదేశించారు. చెరువులకు అనుబంధంగా ఉన్న ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ పరిధులను గుర్తించి ఎలాంటి ఆక్రమణలు జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో చెరువులనీటి నిల్వ స్థాయిలు, ఆక్రమణ పరిస్థితులు, పర్యావరణ మార్పులు ఎలా ఉన్నాయనే సమాచారాన్ని అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చెరువుల ప్రస్తుత స్థితిని పోల్చి డిజిటల్ మ్యాప్స్, సర్వే డేటా ఆధారంగా పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలన్నారు. తెల్లాపూర్ ప్రాంతం హెచ్ఎండిఏ పరిధిలోని భవనాల అనుమతులను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్ఎండిఏ, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ జయభీమ్, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



తెల్లాపూర్ చెరువుల అభివృద్ధిపై సమీక్షిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

# తులం బంగారం కోసం కాంగ్రెస్‌కు ఓట్లు

* ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటం..
* ఫిబ్రవరిలో భారీ బహిరంగసభ..
* బిఆర్‌ఎస్ కార్యకర్తలతో మాజీ సిఎం కెసిఆర్



మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

**మర్కుక్, జనవరి 31 (ప్రభాతవార్త):**

ప్రజలు తులం బంగారం కోసం కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి ఆగమయ్యారని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జహీరాబాద్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలతో కెసిఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పటి వరకు ఒక పథకం కూడా సరిగా అమలుకాలేదన్నారు. కైలాసం ఆడుతుంటే పెద్దపాము మింగినట్లుగా రాష్ట్ర ప్రజల పరిస్థితి తయారైందని తెలిపారు. కరెంటు కోతలు, మంచినీళ్ల కరువు త్వరలోనే కనిపిస్తాయని ఎద్దేవ చేశారు. ప్రజలు ప్రశ్నిస్తే కేసులు పెట్టించి వేధిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని, ఇక ప్రభుత్వంపై ప్రజల తరపున ప్రత్యక్ష పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. నమ్మి ఓట్లు వేస్తే ప్రజలకు మంచి గుణపాఠం చెబుతున్నారని అన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టుల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని, కాళేశ్వరంను ఎండ పెడుతున్నారని, వీటి విషయంలో హరీష్‌రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిఆర్‌ఎస్ శ్రేణులకు కెసిఆర్ పిలుపునిచ్చారు. సబ్బండ వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ ఎంతగానో వేధిస్తుందని, గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని, బిఆర్ఎస్ హయాంలో ఇలాంటి పరిస్థితి లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం కావడంతో పాటు మీడియాలో అబద్దాలు, అసత్యాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కరోనా సమయంలోనూ తాము రైతుబంధు, దళిత బంధు, పింఛన్లు ఇలా ఏ పథకం ఆపలేదని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వానికి కాస్త సమయం ఇవ్వాలనే ఇన్ని రోజులు మౌనంగా ఉన్నామని కెసిఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫిబ్రవరి నెలాఖరులో బిఆర్‌ఎస్ పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

**సిపి డా॥అనురాధ**




సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు పకడ్బంధీగా అమలు చేయాలని సీపీ డాక్టర్ అనురాధ సూచించారు. సీపీ కార్యాలయంలో శుక్రవారం పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాద నివారణకు తగు చర్యలు చేపట్టాలన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ పై ఫిర్యాదుదారులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రెవెన్యూ అధికారులతో కలిసి సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు విధిగా నిర్వహించాలన్నారు. డయల్ 100 కాల్‌కు వెంటనే స్పందించాలన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు, సైబర్‌నేరాలు, అభయ యాప్, సామాజిక రుక్మతులపై విద్యార్థులకు అవగాహన నిర్వహించాలన్నారు. ప్రతి అధికారి నిజాయితీగా విధులు నిర్వహించాలని.. విధి నిర్వహణలో అలసత్వం చేయొద్దన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు సుభాష్‌చంద్రబోస్, మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, రవీందర్, సుమన్‌కుమార్, యాదగిరి, శ్రీనివాస్, కిరణ్, శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**సమీక్షా సమావేశంలో సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్**



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల సరఫరా వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్డు భద్రత కమిటీ మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించిన అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో నిఘాపెట్టాలని ఆదేశించారు. డ్రగ్స్, మత్తుపదార్థాలతో కలిగే హానిపై సోషల్ మీడియాలో, వీడియోలు, ఫొటోలతో అవగాహన ప్రచారం చేయాలన్నారు. అలాగే పాఠశాలలో, కళాశాలలో మత్తుపదార్థాల మూలంగా జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బయట ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలు తరలింపు జరగకుండా తనిఖీలు నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రాజీవ్ రహదారుల వెంబడి అనధికారిక డివైడర్ కటింగ్స్‌లను మూసి వేయాలని సూచించారు. ఇతర గ్రామాల నుంచి రహదారికి కలిసే ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంచార్జి రోడ్డు రవాణాశాఖ అధికారి కొండల్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్, ఎసిపిలు మధు, సతీష్, పురుషోత్తం వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో విధులు నిర్వహించే సిబ్బందికి అవార్డులు-రివార్డులు

**సిపి డా. అనురాధ**




సిఐకు అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందిస్తున్న సిపి

**సిద్దిపేట అర్బన్, జనవరి 31, ప్రభాతవార్త :**

మానభంగం, ఫోక్సో కేసులో నేరస్తునికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.50 వేల జరిమానా విధించడంలో కీలకపాత్ర పోషించిన త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్‌లింగం, కోర్టు మాని టర్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్ స్రవంతి, స్వామి, లోకేష్, శ్రీనివాస్‌రెడ్డిలను సీపీ డాక్టర్ అనురాధ శుక్రవారం సీపీ కార్యా లయంలో అభినందించి అప్రిసియేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించే సిబ్బంది, అధి కారులను గుర్తించి రివార్డులు, అవార్డులు అంద జేయడం జరుగుతుందన్నారు. నేరస్తులకు శిక్షలు పడినప్పుడే నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు.

**సేవా పతకాలు అందజేత...**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పథకాలు పొందిన అధికారులను, సిబ్బందిని సీపీ డాక్టర్ అనురాధ అభినందించి సేవాపతకాలు అందజేశారు. శ్రీరామ్, మల్లికార్జున్ ఏఆర్ కానిస్టేబుళ్లు, మమ్మద్ నసీమా మహిళా హోంగార్డులు ఉత్కృష్ట సేవా పతకం పొందారు. వెంకటరమణారెడ్డి గజ్వేల్, గోపాల్‌రెడ్డి సిద్దిపేట, ప్రభాకర్, చేర్యాల, నారాయణ ఏఆర్, ప్రభు, ఏఆర్, జీవన్‌రెడ్డి హోంగార్డు, అలెగ్జాండర్, నిత్యానందం ఏఆర్ ఎస్ఐలు అతి ఉత్కృష్ట సేవా పతకాలు పొందారు.

**గజ ఈతగాళ్లను నగదు అందజేత**

కొండపోచమ్మ సాగర్‌నీటిలో మునిగి చనిపోయిన వ్యక్తుల మృతదేహాలను త్వరగా బయటకు తీసిన గజ ఈతగాళ్ల తొడంగల యాదగిరి, తొడంగల కృష్ణ, తొడంగల రాజేందర్, తొడంగల నాగరాజు, తొడంగల మహేష్, తొడంగల రాజులను సీపీ కార్యాలయంలో అభినందించి నగదు పురస్కారాన్ని సీపీ డాక్టర్ అనురాధ అందించారు. ఆయా కార్యక్రమాల లో పోలీసు అధికారులు సుభాష్‌చంద్రబోస్, మధు, ఉపేందర్, కిరణ్, పురుషోత్తంరెడ్డి, మహేందర్‌రెడ్డి, లతీఫ్, శ్రీను, సైదా, విజయ్‌కుమార్, కెరుణాకర్ రెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఏ అధికారి క్రిస్టోఫర్

## కాలం చెల్లిన వాహనాలు నడపొద్దు

### ఆర్టీఏ అధికారి క్రిస్టోఫర్

**గజ్వేల్, జనవరి 31 (ప్రభాతవార్త):** కాలం చెల్లిన వాహనాలను నడుపవద్దని, వాహనాలు ఫిట్‌నెస్ చూసుకోవాలని గజ్వేల్ ఆర్టీఏ అధికారి క్రిస్టోఫర్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం గజ్వేల్ ఆర్టీఏ కార్యాలయం వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్, ఆర్‌సితో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. స్కూల్ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ తమ వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు ఇన్సూరెన్స్ కలిగివుండాలని అన్నారు. వాహనదారులు గమ్య స్థానాలకు క్షేమంగా చేరాలంటే వాహనాలను అదుపు చేసే వేగంలో మాత్రమే నడపాలని, గత సంవత్సరం జరిగిన ప్రమాదాలు ఎక్కువగా అతివేగం వల్లే జరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్‌లో బంగారంపై రుణాల మంజూరు



పిఏసిఎస్‌లో బంగారంపై రుణాలు అందిస్తున్న చైర్మన్

**బెజ్జంకి, జనవరి 31, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి బంగారంపై రుణాలను పొందే వెసులుబాటును శుక్రవారం పిఏసిఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంకుల కంటే గ్రాంకు రూ.5500 ఎక్కువగా ఇవ్వడం జరుగుతుందన్నారు. వాహనాలపై సైతం రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి రోజు ఏడుగురు ఖాతాదారులకు రూ.14 లక్షల రుణాలను అందించారు. ఖాతాదారులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండి రమేష్, డైరెక్టర్లు సీత భూమయ్య, మచ్చ రాజేశం, బెజ్జంకి నరేష్, బాబు, సీఈఓ శ్రీనివాస్, అప్రైజర్ బోనాల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమ పథకాల్లో అవినీతి లేకుండా చూడాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రం



లేబర్‌బోర్డు కమిషన్‌కు వినతిపత్రం అందజేయడానికి వెళ్తున్న చంద్రం

**సిద్దిపేట రూరల్, జనవరి 31, ప్రభాతవార్త :** భవన నిర్మాణ రంగాల కార్మిక సంక్షేమ పథకాల అమలులో అవినీతి జరుగుతుందని అవినీతి జరగకుండా చూడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం అన్నారు. శుక్రవారం హైదారాబాద్‌లోని చిక్కడపల్లి కార్మిక భవన్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి లేబర్ బోర్డు డిప్యూటీ కమిషనర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల డిప్యూటీ కమిషనర్ గంగాధర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రంలో కార్మిక సంక్షేమం లేకుంటే భవన నిర్మాణాలు జరిగేవా అని కార్మికుల శ్రమద్వారా వచ్చిన వేలకోట్ల రూపాయలను సెస్సును గత ప్రభుత్వ కరోనా కష్టకాలంలో దుర్వినియోగం చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు విచారణ చేపట్టాలన్నారు. కార్మికుల సంక్షేమ పథకాలు, వెల్ఫేర్ బోర్డు ద్వారా మాత్రమే నిర్వహించాలన్నారు. 55 యేండ్లపై బడిన కార్మికులకు బోర్డు నుంచి పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికశాఖ మంత్రిని నియమించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు సత్కారం

**చిన్నకోడూరు, జనవరి 31, ప్రభాతవార్త :** చిన్నకోడూరు మండల తహసీల్దార్‌గా ఇటీవల బదిలీపై నూతనంగా వచ్చిన తహశీల్దార్ హరి కిరణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు శుక్రవారం శాలువాతో ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో నాయకులు జేరిపోతుల లక్ష్మణ్, మల్లమారి రంగరాజం, కొట్టెపల్లి పరశురాములు, కొలను రమేష్, ఎర్ర మురళి, నందయ్య, రాజమల్లు, పరుశరాములు, ఎర్ర అంజనేయులు, బబ్బురు కుమార్, మహంకాళి, అశోక్, శంకయ్య పాల్గొన్నారు.

## అధైర్యపడదొద్దు.. అండగా ఉంటాం

### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

**సిద్దిపేట అర్బన్, జనవరి 31, ప్రభాతవార్త :** అధైర్యపడొద్దు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో నివాసముంటున్న రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో శుక్రారం బాధిత కుటుంబీకులను పరామర్శించి తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అదుకునేలా అర్బన్ తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. నివాసముంటున్న రేకుల ఇల్లు పూర్తిగా దగ్ధమై బాధిత నిరుపేద కుటుంబం రోడ్డున పడ్డదన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలన్నారు. ఆయన వెంట నంగునూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, నజ్జు, ఫయాజుద్దీన్, మిట్ట పల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలికి ఘనంగా వీడ్కోలు



వదవీవిరమణ పొందిన ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**చౌటకూరు, జనవరి 31, ప్రభాతవార్త:**
35సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన మండలపరిధిలోని బొమ్మరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బి.స్వర్ణలతను గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. స్వర్ణలత తన విధినిర్వహణలో అందించిన సేవలను ఈసందర్భంగా ఉపాధ్యాయులు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలయ్య, చౌటకూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయసంఘం నాయకులు సుభాష్‌బాబు, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్‌గౌడ్, గోపికృష్ణ, దేవేందర్, కిషన్, శ్రీధర్‌రావు, పుల్‌కల్ మండల బాధ్యులు శిరీష, రాజేశ్వరి, ఇస్మాయిల్, సిఆర్‌పిలు ఆంజనేయులు, వినయ్‌కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తండాల్లో జోరుగా పాతపంటల జాతర



పాతపంటల జాతరకు నృత్యాలుచేస్తూ స్వాగతం పలుకుతున్న గిరిజనులు

**జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని జంలై తండా, శేఖాపూర్ తండాలకు చేరుకున్న పాత పంటల జాతరను గిరిజన మహిళారైతులు లంబాడీనృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. డిడిఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 25వ పాతపంటల జాతరకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా తండాలకు పాతపంటల విత్తనాలతో అందంగా అలంకరించిన ఎడ్లబండ్లు చేరుకోగానే గిరిజనుల తమ సంప్రదాయ నృత్యాలుచేస్తూ జాతరబండ్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వాగతం పలికారు. తండాల్లోని వీధులలో పాత పంటల జాతర ఎడ్లబండ్లను ఊరేగించారు. కార్యక్రమంలో డిడిఎస్ బాధ్యులు వినయ్‌కుమార్, పంటల యాజమాన్య శాస్త్రవేత్త రమేష్, ఎస్ నర్సింలు, శ్రీలయ, చాంధిబాయి, చుక్కమ్మ, జాతర కో-ఆర్డినేటర్లు వినయ్‌కుమార్, మంజుల, సిబ్బంది చుక్కమ్మ, విజయలక్ష్మి, జనరల్ నర్సమ్మ, అల్గోల్ నర్సమ్మ, హుమ్నాపూర్ లక్ష్మమ్మ, చిన్న నర్సమ్మ, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతికి సెలవు ప్రకటించాలి

**-మాజీ మంత్రిని కోరిన గిరిజన నాయకులు**



మాజీమంత్రి హరీష్‌రావును కలిసిన బంజార నాయకులు

**పాపన్నపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
సంత్ సవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని కోరుతూ మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావును శుక్రవారం హైద్రాబాద్‌లోని కోకాపేట్ నివాసంంలో గిరిజన నాయకులు కలుసుకుని వినతి చేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా బంజార సంఘం అధ్యక్షులు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూల్సింగ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మోహన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. సంత్ మహారాజ్ జయంతిని రోజులు సెలవు ప్రకటించేలా తమవంతు కృషిచేస్తామని మాజీమంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు.

## ఆసుపత్రి శంకుస్థాపనలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఉస్మానియా హాస్పిటల్ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 31, ప్రభాతవార్త:**
హైద్రాబాద్ పట్టణంలోని గోషామహల్ నియోజకవర్గంలో శుక్రవారం 2 ఎకరాల్లో ఉస్మానియా ఆసుపత్రి భవనాల నిర్మాణాల కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్, మంత్రులు, శాసనసభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన అనుచరులతో కలిసి పాల్గొన్నారు.

## వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు..



టేక్మాల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**టేక్మాల్, జనవరి 31, ప్రభాతవార్త:**
ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ ఈనెల 7వ తేదీన చేపట్టనున్న వేల గొంతులు, లక్ష డప్పుళ్ల కార్యక్రమానికి మద్దతుగా శుక్రవారం మండల కేంద్రమైన టేక్మాల్లో భారీర్యాలీ నిర్వహించారు. టేక్మాల్ చౌరస్తా నుంచి ర్యాలీగా బయలుదేరి మండల కార్యాలయం ఆవరణలో ఉన్న అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలువేసి టేక్మాల్‌గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు మురళి, జిల్లా అధ్యక్షులు యాదగిరి, ఎల్లయ్య, బొచ్చిలి సుధాకర్ సాయిలు, నాగరాజు, లక్ష్మణ్, అబ్రహ్మం, శ్రీనివాస్, శివ కుమార్, రమేష్‌లు తదితరులు ఉన్నారు.

# కంది ఐఐటిలో యోగా ధ్యానాలపై శిక్షణ




కంది ఐఐటిలో యోగా గురువును పరమార్థదేవ్‌స్వామి సత్కరిస్తున్న ఐఐటి సభ్యులు

**కంది, జనవరి 31, ప్రభాతవార్త:**
కంది ఐఐటిలో గురువారం యోగా ధ్యానాదులపై రాందేవ్‌బాబా శిష్యులు స్వామిపరమార్థదేవ్ ఆధ్వర్యంలో శిక్షణాతరగతులు నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బంది శిక్షణాతరగతులను ఆసక్తిగా తిలకించారు. ఈసందర్భంగా పరమార్థదేవ్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో సంపాదన కొందరి వద్దే ఉన్నా అనారోగ్యం మాత్రం ప్రతి ఒక్కరి వద్ద ఉందని గుర్తుచేశారు. ఒత్తిడికి గురై విశ్రాంతి లేకుండా సంపాదనే లక్ష్యంగా పెట్టుకుని రాత్రి పగలు తేడాలేకుండా పనులు చేస్తుండటంతోనే ప్రశాంతత కరువై అశాంతితో జీవితాలు గడుపుతుండటంతో రోగాలబారిన పడుతున్నామని పేర్కొన్నారు. మందుల వాడకంతో మరిన్ని రోగాల బారిన పడుతున్నామన్నారు. యోగసాధన ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా, ఖర్చులు లేకుండా మన అనుకూల సమయాల్లో అనుకూల స్థలంలో హాయిగా యోగాసనాలు, ప్రాణాయామ సాధన చేసుకోవచ్చని, ఫలితంగా ఆరోగ్యంగా జీవించగలుగుతామన్నారు. ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇస్తూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా తమవంతు కృషిచేస్తున్నామన్నారు. శిక్షణ కార్యక్రమంలో సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ పాల్గొని శిక్షణ అందుకున్నారు. కార్యక్రమంలో భారత్ స్వామి రాష్ట్ర అధ్యక్షులు జి.శ్రీధరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నందనం కృపాకర్, ఉపాధ్యక్షులు శివకుమార్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నవాజ్‌రెడ్డి, ప్రొఫెసర్‌లు బిఎస్ మూర్తి, పాల్, డాక్టర్ హిమాంశు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా

**-విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 31, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెలలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కామరతి సమేత బీరప్పస్వామి ఆలయంలో నూతనంగా విగ్రహప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, సర్పంచులసంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు సోమిరెడ్డి, మాజీ ఎంపిపి అధ్యక్షులు యదగిరియాదవ్, గూడెం మధుసూదన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కొమరయ్య, శ్యామ్‌రావు, ఉమేష్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## పల్టీ కొట్టిన కారు-ఇద్దరికి గాయాలు



సరాఫ్‌పల్లి జాతీయరహదారిపై పల్టీకొట్టిన కారు దృశ్యం

**చౌటకూరు, జనవరి 31, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని సరాప్‌పల్లి జాతీయరహదారిపై కారు బోల్తాపడ్డ సంఘటనలో ఇరువురు గాయాలకుగురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన గణేష్ (25), మహానంద (23)లు టిజి 08 ఎఫ్ 2774 మారుతి రిట్జ్ కారులో హైద్రాబాద్‌కు వెళుతున్న క్రమంలో సరాఫ్‌పల్లివద్ద ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను సంగారెడ్డి పట్టణంలోని ప్రయివేటు ఆసుపత్రికి చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం



కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధంచేస్తున్న దళితసంఘాలనాయకులు

**పుల్‌కల్, జనవరి 31, ప్రభాతవార్త:**
ప్రజాయుద్ధనౌక గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, విభజించు-పాలించు అనేపదానికి కేంద్రమంత్రి మాటలు నిలుస్తున్నాయని, బండి సంజయ్ తనుచేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మండలపరిధిలోని బస్వాపూర్ మోడల్‌స్కూల్ చౌరస్తావద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధచేశారు. ఆర్ఎస్ఎస్, బిజెపి కుట్రలు దాగి ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్య క్రమంలో పుల్‌కల్ దళితసంఘం నాయకులు మేతరి పోచయ్య, మధుసూదర్, రాజు, కరుణాకర్, రవికుమార్, గిరిప్రసాద్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రులను కలిసిన ఆదర్శ్‌రెడ్డి



మాజీ మంత్రులను కలిసిన ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జనవరి 31, ప్రభాతవార్త:**
రాష్ట్ర మాజీమంత్రులు తన్నీరు హరీష్‌రావు, కల్వకుంట్ల తారక రామారావులను బిఆర్ఎస్ రాష్ట్రనేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి శుక్రవారం హైద్రాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కుమార్తె వివాహపత్రికలను మాజీమంత్రులకు అందచేసి వివాహ వేడుకలకు హాజరై వధువరులను ఆశీర్వదించాలని వినతిచేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, తెల్లాపూర్ మాజీసర్పంచ్ సోమిరెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటిసి సభ్యులు బాల్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్‌లు, నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## చర్చి ప్రారంభోత్సవంలో మాజీ చైర్మన్



ఇప్పేపల్లిలో చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ చైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఇప్పేపల్లిలో నూతనంగా నిర్మించిన చర్చిని శుక్రవారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ వై.నరోత్తం పాల్గొన్నారు. ఈసందర్భంగా చర్చిలో ప్రత్యేకప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డిఎస్ సుకుమార్, సి.క్రాష్, పాస్టర్ డి.అరుణ్‌కుమార్, సెక్రటరీ రవి కుమార్, మోజెస్, మాజీసర్పంచ్ స్వామిదాస్, నర్సింలు, మల్‌శెట్టి,రామ్‌శెట్టి, దావీదు, ఏసన్న, సంఘపెద్దలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేసిన దృశ్యం

**గజ్వేల్, జనవరి 31, ప్రభాతవార్త:**
గజ్వేల్‌పట్టణంలోని పాండవుల చెరువు వద్దగల మడేలయ్యగుడి ముందున్న బైపాస్ రోడ్డులో శుక్రవారం రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ వైస్‌చైర్మన్ జకియొద్దీన్, మాజీ కౌన్సిలర్లు శ్రీధర్, చందు, నర్సింగరావు, గజ్వేల్ నియోజకవర్గ రజకసంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్, నియోజకవర్గ నాయకులు నర్సింలు, సురేష్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి భూమిపూజచేశారు. ఈకార్యక్రమానికి అధ్యక్షత వహించిన రజకసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాంగారి శ్రీధర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మవిగ్రహ ఏర్పాటుకు సహకరిస్తున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో రజకసంఘం నాయకులు రాంగారి శివరాజయ్య, మల్లేశం, ఎర్రవాడ బాలకృష్ణ, నాగరాజు, వెంకటేష్, శంభుగారి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల అభ్యున్నతికి పాటుపడాలి




బేటి బచావో-బేటి పడావో కార్యక్రమానిన నిర్వహిస్తున్న దృశ్యం

**నర్సాపూర్ రూరల్, జనవరి 31, ప్రభాతవార్త:**
సమాజంలో ఆడపిల్లల అభ్యున్నతికి ప్రతి ఒక్కరు పాటుపడాలని డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ సంతోషి అన్నారు. శుక్రవారం మండలపరిధి చిప్పాలతుర్తి కెజిబివి స్కూల్‌నందు మెదక్‌జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్‌శక్తి మహిళాసాధికారిత కేంద్రంవారు బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ సంతోషి మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షిద్దాం ఆడపిల్లలను చదివిద్దాం అనే విషయం గురించి వివరించారు. గ్రామాలవారీగా ప్రతి ఒక్కరూ బాల్యవివాహలు జరిగితే 1098కు సంప్రతించాలని, ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు, ఆపదలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఉండి సెల్ఫ్‌ప్రొటెక్షన్ గాని, తల్లిదండ్రులను కానీ టీచర్లకు గాని సంప్రతించాలని తెలిపారు. ఐసిపిఎస్ సోషల్ వర్కర్ సరిత మాట్లాడుతూ బాల్యవివాహాలు, చైల్డ్ అబ్యూస్ గురించి వివరించడం జరిగింది. భరోసా సెంటర్ సౌందర్య మాట్లాడుతూ పోక్సో యాక్టు గురించి వివరించారు. కెజిబివి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు వాడొద్దని, ఇన్‌స్టాగ్రామ్ గాని ఫేసుబుక్ గాని వాడొద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో టీం శ్రీలత, సౌందర్య, కెజిబివి టీచర్లు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ పూజలు



వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ పూజలు

**సంగారెడ్డి టౌన్, జనవరి 31, ప్రభాతవార్త:**
జిల్లాకేంద్రమైన సంగారెడ్డిపట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆత్మార్పణ పూజాకార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయకమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో హోమాలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని అందంగా అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించుకుని పల్లకి సేవాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మేడం రాధాకిషన్, కోశాధికారి జూలకంటి మల్లేశం, కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఆర్యవైశ్య సంఘం పట్టణకార్యదర్శి నామ భాస్కర్, కోశాధికారి ఆమేటి భాస్కర్, సభ్యులు ఆమేటి ప్రభులింగం, గుండ్లపల్లి నరేష్‌కుమార్, బండారు యాదగిరి, యువజనసంఘం అధ్యక్షులు తోపాజి హరీష్, మహిళా నాయకులు తోపాజి తేజావతి, తేజవాటైజ్ మాలతి పాల్గొన్నారు.

## ప్రీమియర్ లీగ్ విజేత గోపాల్ టీం



విజేతలకు బహుమతులను అందిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
మండలపరిధి ఖాజాపూర్‌తండాలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ పోటీలలో గోపాల్ జట్టు విజయంసాధించింది. వారంరోజులుగా జరుగుతున్న ఈటోర్నిలో గోపాల్ జట్టు, విఠల్ జట్లు ఫైనల్‌లో పోటీపడ్డాయి. ఫైనల్‌లో విఠల్ టీంపై గోపాల్ టీం విజయం సాధించింది. విజేతగా నిలిచిన గోపాల్ జట్టుకు రూ.20వేలు, రన్నరప్‌గానిలిచిన విఠల్ జట్టుకు రూ.10వేలు నగదుపురస్కారాన్ని నిర్వాహకులు ప్రశాంత్, సుభాష్ దాసు, నరేష్‌లు అందించారు. కార్యక్రమంలో నాయకులు లాల్యా నాయక్, రామకిష్టయ్య, శివనాయక్, నరేష్, తారాచంద్, మోతిలాల్, రమేష్‌లు తదితరులు పాల్గొన్నారు.


## పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట, జనవరి 31, ప్రభాతవార్త:**
ఫిబ్రవరి 27న నిర్వహించే శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మన్నన్ శుక్రవారం పరిశీలించారు. చిన్నశంకరంపేటపట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలుసూచనలు చేశారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయనవెంట ప్రధానోపాధ్యాయులు దీప్లానాయక్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించిన ఎంపిడిఓ



అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఓ

**చౌటకూరు, జనవరి 31, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన చౌటకూరులోని అంగన్‌వాడి కేంద్రాన్ని ఎంపిడిఓ బి.రామలింగం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం వివరాలను ఎంపిడికేంద్రం బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో 16మంది చిన్నారులు ఉన్నట్లు నిర్వాహకులు ఎంపిడిఓకు వివరించారు. కేంద్రానికి అడ్మిషన్ పొందిన వారు నిత్యం విధిగా వచ్చేలాచూడాలని ఎంపిడిఓ ఆదేశించారు.

## ప్రత్యేకాధికారుల చేతుల్లో తెలంగాణ రాష్ట్రం

**-వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, జనవరి 31, ప్రభాతవార్త:**
తెలంగాణరాష్ట్రంలో సర్పంచులు, ఎంపిటిసిలు, మున్సిపల్ చైర్మన్లు, జెడ్‌పిటిసిలు, జెడ్పి చైర్మన్లు లేక గ్రామాలలో ప్రత్యేకాధికారుల పాలన రాజ్యమేలుతుందని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలో ప్రతి గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లు, 136మున్సిపాలిటీలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయన్నారు. రాష్ట్రంలో పరోక్షంగా ప్రెసిడెంట్ రూల్ నడుస్తుందన్నారు. గతంలో ఇచ్చిన కెసిఆర్ పథకాలను, అభివృద్ధిని నిర్వీర్యం చేసేవిధంగా కాంగ్రెస్ నిరంకుశ ధోరణి ఉందని అన్నారు. కాంగ్రెస్ అసమర్థ ఏడాది పాలనకు ప్రజలు చీకొడుతున్నారని, ఎన్నికలు పెట్టుకుంటే కాంగ్రెస్‌పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని, ఓడిపోతారనే భయంతో రేవంత్‌రెడ్డి స్థానికసంస్థల ఎన్నికలు పెట్టకుండా పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు.

## బండి కిందపడి వ్యక్తి మృతి

**మనూర్, జనవరి 31, ప్రభాతవార్త:**
ప్రమాదవశాత్తు చెరుకుబండి కిందపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మనూర్ ఎస్ఐ శంకరయ్య కథనం ప్రకారం.. మండలంలోని మధిరతండాకు చెందిన చౌహాన్‌చావన్ (50) కుటుంబసభ్యులతో కలిసి మండలపరిధిలోని బాదల్‌గావ్ గ్రామానికి చెందిన వ్యక్తి చెరుకును నరికేందుకు వచ్చాడన్నారు. గురువారం సాయంత్రం ఎద్దులబండిలో చెరుకును నింపుతుండగా ప్రమాదవశాత్తు బండి కిందపడటంతో బండి చావన్‌పై నుంచి వెళ్లి చావన్ మృతిచెందాడన్నారు. మృతునిభార్య జానబాయి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.